క్లుప్తంగా

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అద్దె ఉచిత గ్రంథాలయం బిల్డింగ్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయం పనితీరు, అందుబాటులో ఉన్న పుస్తకాలు, సౌకర్యాలపై పాఠకులతో ఆరా తీశారు. గ్రంథాలయ సెస్సు బకాయిలు వసూలుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బాబుప్రసాద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

గుమ్మఘట్ట: భూపసముద్రంలో వీఆర్‌ఏ హనుమప్ప (63) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని హనుమప్ప మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

దివ్యాంగుల దినోత్సవం



నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో కరిబసవేశ్వర విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆర్‌డీటీ సీఈఓ శ్రీరాములు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆర్‌డీటీ దివ్యాంగులకు అన్ని విధాల భరోసా కల్పిస్తూ వారిని ఆదుకుంటుందన్నారు. కరిబసవేశ్వర మండల సమాఖ్య అధ్యక్షుడు నింబగల్లు రాము, ఉపాధ్యక్షులు అంజినప్ప మాట్లాడుతూ దివ్యాంగులకు ఆర్డీటీ అందిస్తున్న సహకారం మరవలేనిదన్నారు. అనంతరం పేద దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను అందించారు. ఆర్డీటీ సీబీటీలు సుధారాణి, చంద్రకళ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంటౌన్: పట్టణం శివారు బీటీపీ లేఅవుట్‌లో అయోధ్య కళ్యాణ సీతారాముల నూతన ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చే శారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు ముఖ్య అతి థులుగా హాజరై పూజలు చేసి ప్రారంభించా రు. వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు బండి కిష్టప్ప, ప్రముఖ వైద్యుడు గోపాలరావు, కౌన్సిలర్లు శ్రీలక్ష్మీ, శారదాదేవి, గౌనిలావణ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు బంగి శంకర్ పాల్గొన్నా రు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర కుమార్

బ్రహ్మసముద్రం : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన అవసరమని ఎస్‌ఐ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ వాడకంతో వచ్చే అనర్థాలను వివరించారు. సమాజంలో ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాలపై కూడా విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థినులు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబుకు కౌలు రైతు సంఘం నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు పెద్దముష్టూరు వెంకటేష్, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడారు. పెన్నహోబిలానికి జిల్లా నలమూలల నుంచే కాక కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారన్నారు. తాగునీటి వసతితో పాటు మరుగుదొడ్లు భక్తులకు సరిపడా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం కింది భాగంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. భక్తులు సేద తీరడానికి విశాలమైన పార్కు ఏర్పాటు చేయాలని, పచ్చదనాన్ని పెంచాలని కోరారు.

శనగ రైతుపై ఎందుకీ నిర్లక్ష్యం?

- నేటికీ అందని గతేడాది రబీ పంట నష్టపరిహారం
- ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో 26 వేల హెక్టార్లలో దెబ్బతిన్న శనగ పంట
- రూ.21.74 కోట్ల మేర అందాల్సిన పరిహారం





బెళుగుప్పలో అతివృష్టి కారణంగా కుళ్లిన పప్పుశనగ పంటను చూపుతున్న రైతు (ఫైల్) , ఉరవకొండలో పూర్తిగా దెబ్బతిన్న పప్పుశనగ పంట (ఫైల్)

ఉరవకొండ: టీడీపీ ఎప్పుడు అధికారంలో ఉన్నా.. రైతులు, వ్యవసాయంపై నిర్లక్ష్యం చూపుతుందనేది నిష్ఠూరు సత్యం. గతేడాది రబీ సీజన్‌లో సాగుచేసిన శనగ పంట వర్షానికి దెబ్బతినింది. దాదాపు 22,562 వేల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లగా... అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నష్ట పరిహారంగా రూ.21,74,60,367 మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసినా చెల్లింపులు జరగలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లింపుపై పట్టించుకోవడంలేదు. దీంతో 22 వేల మంది రైతులు పరిహారం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో గతేడాది రబీ సీజన్‌లో అత్యధికంగా పప్పుశనగ, వరి, మొక్క జొన్న తదితర పంటలు సాగు చేశారు. నాడు కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచి పైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే తేమ శాతం పెరిగి తెగుళ్ల విజృంభించడంతో దిగబడులు పూర్తిగా పడిపోయాయి. పంటలు నష్టపోయిన తీరును అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం బెళుగుప్ప, బొమ్మనహాళ్, డీ.హిరేహాళ్, గుత్తి, గుంతకల్లు, కణేకల్లు, పెద్ద పప్పూరు, పుట్లూరు, తాడిపత్రి, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, యాడికి, యల్లనూరు తదితర మండలాలను కరువు మండలాలుగా గుర్తించారు. ముఖ్యంగా రబీలో జిల్లాలో సాగుచేసిన పప్పుశనగ పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో ఉరవకొండ, వజ్రకరూరు, కణేకల్లు మండలాల్లో 2004లో జూన్ 19న పర్యటించారు.

పరిహారం కోసం రైతుల ఎదురు చూపు:

ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల్లో అత్యధికంగా పప్పుశనగ 26,562 వేల హెక్టార్లలో సాగుచేశారు. 21,631 మంది రైతులకు సంబంధించి రూ.21,74,60,367 నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మొత్తం రైతుల వ్యక్తిగత ఖాతాల్లోకి జమ చేసే సమయంలో సాధారణ ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లింపును పక్కనపెట్టేసింది. మంజూరైన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడం పై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మంజూరు చేయాల్సింది కాదని, కేవలం ఖాతాల్లో జమ చేయడానికి కూడా కూటమి ప్రభుత్వానికి చేతులు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా గతేడాది రబీలో నష్టపోయిన పంటలకు ప్రకటించిన పరిహారం వివరాలు

మండలం	రైతులు	హెక్టార్లు	పరిహారం (రూ..లలో)
ఉరవకొండ	3,499	3,900	3,20,82,170
వజ్రకరూరు	4,477	4,477	5,48,82,170
బెళుగుప్ప	2,500	3,289	3,21,40,575
కణేకల్లు	4,892	5,923	5,12,82,170
డి.హిరేహాళ్	3,263	4,473	2,50,51,291
బొమ్మనహాళ్	3,000	4,500	2,20,21,991
మొత్తం	21,631	26,562	21,74,60,367

పరిహారం మంజూరు కాలేదు



గతేడాది రబీలో 10 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేసి తీవ్రంగా నష్టపోయాను. అధికారులు అంచనా వేసి రూ.20 వేల పరిహారం వస్తుందని తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రకటించిన మొత్తం చెల్లింపులు నిలిచిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం శనగ రైతుల పరిహారంపై ఆలోచించడంలేదు.

– అనిల్‌కుమార్, తగ్గుపర్తి గ్రామం, బెళుగుప్ప మండలం

ప్రభుత్వం సాయం అందించాలి



గత ప్రభుత్వం శనగ రైతులకు ఆదుకోవడానికి ఉదారంగా పరిహారం ప్రకటించినా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కక్ష సాధింపుగా వ్యవహరిస్తోంది. పరిహారం మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చూపుతోంది. ఐదెకరాల్లో రూ.20 వేల పరిహారం మంజూరు కావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

– పరమేష్, గడేహోతూరు గ్రామం, వజ్రకరూరు మండలం

కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ?



సీఎం చంద్రబాబుకు రైతుల కష్టాలు పట్టడంలేదు. రబీలో అత్యధికంగా ఉరవకొండ నియోజకవర్గంలో శనగ సాగుచేసి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ప్రభుత్వంలో వ్యవసాయాన్ని పండగలా మార్చి రైతులను అన్నివిధాలుగా ఆదుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన పరిహారాన్ని కూటమి ప్రభుత్వం మంజూరు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలి.

– అశోక్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు, రాకెట్ల గ్రామం

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలంలోని పూలచెర్లలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా జరిగింది. ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి మంగళారతి, మహా మంగళారతి, కుంకుమార్చన, ఆకు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, కెంగుట రామిరెడ్డి ఆలయంలో పూజలు చేయించారు.

రూ.1,500 కోట్ల పంట రుణాలు

- కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ లారెన్స్

కుందుర్పి: ఖాతాదారులే బ్యాంకుల అభివృద్ధికి మూలాధారమని కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ లారెన్స్ తెలిపారు. శనివారం ఆయన కుందుర్పి కెనరా బ్యాంక్ ను ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈఏడాది ఖరీఫ్ పంటల సాగుకు 88,621 మంది రైతులకు రూ.1500 కోట్లు పంట రుణాలకు అందించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,200 మహిళా సంఘాలకు రూ.800 కోట్లు, వ్యాపారాలకు రూ.380 కోట్లు, విద్య, వాహన తదితర వాటికి రూ.600 కోట్లు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం శ్రీనిధికి సంబంధించి మహిళా సంఘాలకు ఒక్కో మహిళకు రూ.లక్ష వరకు అందిస్తున్నామన్నారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ యుగంధర్, అసిస్టెంట్ మేనేజర్లు సాయితేజ, కృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవమ్మకు ఘన నివాళి



కొనకొండ్లలో వై.ఉమాదేవి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



వై.ఉమాదేవి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి (ఉమాదేవమ్మ) ప్రథమ వర్ధంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఉమాదేవి సమాధి వద్ద ఆమె భర్త ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, కుమారుడు వై.భీమిరెడ్డి, కోడలు నవ్యతారెడ్డి, కుమార్తె వై.కీర్తిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సతీమణి శైలజారెడ్డి, మంత్రాలయం మాజీ ఎంపీపీ సీతారామిరెడ్డి సతీమణి గిరిజమ్మ, సీనియర్ నాయకుడు జయరామిరెడ్డి సతీమణి మంజులమ్మ, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ వై.నైరుతి రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువ నాయకులు ప్రదీప్‌రెడ్డి, కపిలేశ్వరరెడ్డి, తదితరులు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి హాజరై ఎమ్మెల్సీ సతీమణి వై.ఉమాదేవి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉరవకొండ, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, నియోజవర్గాలతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

లింగ నిర్ధారణపై అవగాహన అవసరం

- ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించాలని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భ్రూణ హత్యలు చాలా నేరమన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో ఇప్పటికీ చాలా మంది మెడికల్ షాపులలో దొరికే ప్రెగ్నెన్సీ కిట్లతో ఆర్‌ఎంపీల సలహాలతో నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. ఇలాంటివి వికటించి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మరోసారి జరిగే సమావేశానికి మెడికల్ అసోసియేషన్ సభ్యులను, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. లింగ నిర్ధారణపై ఉపాధ్యాయులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రవి ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజేష్, డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ కెంచె లక్ష్మీనారాయణ, డాక్టర్ జమీలా బేగం, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్, ఆర్డీటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

వరి దిగుబడి పతనం

కూడేరు: ఖరీఫ్‌లో సాగు చేసిన వరి దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదని డిప్యూటీ గణాంకాధికారి హరికృష్ణ తెలిపారు. శనివారం కూడేరు మండల పరిధిలోని కరుట్లపల్లిలో నాగన్న అనే రైతుకు చెందిన వరి పంటలో పంట కోత ప్రయోగాన్ని చేపట్టారు. 5 x 5 మీటర్ల కొలతలో 13 కేజీలు దిగుబడి వచ్చిందన్నారు. ఈ లెక్కన ఎకరాకు 21 క్వింటా వచ్చినట్లన్నారు. దిగుబడి బాగుంటే 40 క్వింటాళ్ల వరకు అవుతాయని డిప్యూటీ గణాంకాధికారి హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, ఏఎస్ఓ ఆశా, వీఏఏ సాయి ప్రమోద్, వీహెచ్ఏ రాజకుమార్, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ మార్పు

కూడేరు: మండలంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ శనివారం తెలిపారు. 9న ఉదిరిపికొండ, 11న కొర్రకోడు, 13న ఇప్పేరు, 17న కలగళ్ల, 19న మరుట్ల, 21న ఉదయం గొటుకూరు, మధ్యాహ్నం బ్రాహ్మణపల్లి, 24న కమ్మూరు, 27న ఉదయం జయపురం ,మధ్యాహ్నం ఎంఎంహళ్లి, జనవరి 2న తిమ్మాపురం, 4న చోళసముద్రం, 7న కూడేరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

కుందుర్పి: మండలంలోని కరిగానిపల్లిలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పందన కరువైంది. రెవెన్యూ సదస్సు ఉంటుందని ముందుగానే తెలియజేసినా రైతులు రాలేదని జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి తెలిపారు. భూసమస్యలు ఆన్‌లైన్ ద్వారా పరిష్కారమవుతుండగా అర్జీలతో సమస్యలు పరిష్కారం కావంటూ రైతులు తిప్పే స్వామి, రాజు, లోకేష్, రామాంజనేయులు తదితరులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయం వద్ద అధికారులు ఉండి వెళ్లిపోయారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బోయ ఓబులేషు, పద్మ దంపతుల కుమార్తె చంద్రకళ చికిత్స కోసం మానవతావాదులు స్పందించి ఆర్థిక సాయం అందించారు. 9వ తరగతి విద్యార్థిని చంద్రకళ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈమెకు చికిత్సకు రూ. 1.50 లక్ష అవసరం కావడంతో మానవతావాదులు ముందుకొచ్చి ఆర్థికసాయం అందిస్తున్నారు. శనివారం విశ్వహిందూ పరిషత్ కమిటీ, మిత్ర బృందంతో కలిసి రూ.52 వేలు ఆర్థిక సాయం చేశారు.

పిల్లలకు మనమిచ్చే ఆస్తి చదువొక్కటే

- ఉరవకొండ జెడ్పీ బాలికల పాఠశాలలో ఆర్డీఓ శ్రీనివాస్



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

ఉరవకొండ: పిల్లలకు మనమివ్వ గలిగే ఆస్తి చదవొక్కటే అని గుంతకల్లు ఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఉరవకొండలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీడీఓ రవిచంద్ర, ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, ఉరవకొండ ఎంఈఓ-1,2లు ఈశ్వరప్ప, రమాదేవి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, వైద్యాధికారిణి డాక్టర్ సాహితి, హెచ్‌ఎం అనితకుమారి, పాఠశాల సీనియర్ పీడీ లతాదేవి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

రాయదుర్గంటౌన్: విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. రాయదుర్గంలోని జెడ్పీబాలికోన్నత పాఠశాల, కల్లీమఠం మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరయ్యారు.

విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలి ....

కళ్యాణదుర్గం: చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచి మంచి నడవడికను అలర్చుకోవాలని ఆర్డీఓ వసంత బాబు చెప్పారు. శనివారం కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ కలయిక (మెగా పీటీఎం) జరిగింది. ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చిన్నప్పటి నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకొని చదవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వంశీకృష్ణ, ఎంఈఓ బాబు, హెచ్ గంధం శ్రీనివాసులు, పాఠశాల చైర్మన్ ధర్మరాజు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని తహసీల్దార్ శ్రీనివాసులు, రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. గుమ్మఘట్ట మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఎంఈఓ రామచంద్ర, ఎస్ఐ ఈశ్వరయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల-2 హైస్కూల్‌లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. హెచ్‌ఎం వేణుగోపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పెన్నోబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుందుర్పి : మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. పలుచోట్ల విద్యభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యతపై నిలదీశారు. ప్రభుత్వం నాసిరకం బియ్యం అందించడం వల్ల అన్నం ముద్దగా ఉంటోందని, దీంతో అనారోగ్యంపాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోషియేషన్ అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్, ఎంఈఓలు తిప్పేస్వామి, ఓబుళపతి, వైద్యాధికారిణి అనూషా, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారి తిప్పేస్వామి, తహశీల్దార్ మునివేలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దాస్, హెచ్‌ఎం రాజ్‌కుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ కమలమ్మ, సర్పంచ్ ముక్కన్న, ఎంపీటీసీ వనజాక్షి పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. డ్వామా పీడీ సలీంబాషా, ఎంఈఓలు ఓబుళపతి, కృష్ణానాయక్, ఎంపీడీఓ నందకిశోర్, ఎస్ఐ నరేంద్రకుమార్, ఎస్ఓ మహాలక్ష్మీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కంబదూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, తహసీల్దార్ బాలకిషన్, ఎంఈఓ మదన్‌మోహన్ పాల్గొని మాట్లాడారు.

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సర్పంచు తిరుపాల్‌యాదవ్, విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్, హెచ్‌ఎం రామప్పచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే భవిష్యత్

బెళుగుప్ప: ఉన్నత చదువుతోనే భవిష్యత్ ఉంటుందని డిగ్రీ కళాశాల ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు కోనంకి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దుద్దేకుంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బాల మురళీకృష్ణ అధ్యతన తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సర్పంచ్ రత్నమ్మ, మాజీ వైస్ ఎంపీపీ తిమ్మప్ప పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యషష్ఠి



నవనాగులకు పూజలు చేస్తున్న రామ్మూర్తి స్వామీజీ

- విశేష పూజలందుకున్న స్వామి వారు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తిస్వామిజీ ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్య స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆకులపూజ నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద శ్రీనవనాగుల కట్ట నవనాగులకు పంచామృతాభిసేవ, మహామంగళహారతి, తీర్ధ ప్రసాద వినియోగం చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

ఉరవకొండ: ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి, కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అభిజిత్ లగ్నం నందు శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంలో ఉంచి, పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు.